కథ

# నారాయణమ్మ

డా॥ కొలారి వాణీచలపతిరావు

**ఈయాంత్రిక యుగంలో మనిషి ఒక నడుస్తున్న రోబోట్.**
**ఈ జెట్ స్పీడ్ కాలంలో మనిషి ఎక్కు పెట్టిన విల్లు.**
**నవ నాగరిక జీవనంలో మనిషి ఒక షోకేసు బొమ్మ.**
**అందుకే అతనికి సాటి మనిషి గురించి ఆలోచించటానికి సమయం దొరకడంలేదు.**

తనలోకి తను తొంగిచూసుకుని తనేమిటో విశ్లేషణ చేసుకోవటానికి ఓపిక వుండటం లేదు ఎవ్వరికీ. పార్వతమ్మగారు మంచాన పడి నెలరోజులు కావస్తోంది. ఆవిడకు డెబ్బయ్ ఎనిమిదో సంవత్సరం నడుస్తోందిప్పుడు. అయినా వెనుకటి బలంతో నిన్న మొన్నటిదాకా మనిషి గట్టిగానే వుండేది. మెల్లగా అడుగులో అడుగువేసుకుంటూ ఇల్లంతా తిరిగి తన పనులు తానే చేసుకునేది.

అలాంటావిడకు ఇప్పుడు పక్షవాతం వచ్చింది. కాలు, చెయ్యి రెండూ పడిపోయాయి. మాట కూడా నంగిగా వస్తోంది.

ఆవిడ పరిస్థితి చూసి కోడలు సుశీలకు కాళ్లు చేతులు ఆడలేదు. ఉదయం పది గంటలయ్యే సరికి భర్త బ్యాంక్‌కు, తను సెక్రటేరియట్‌కు, పిల్లలు స్కూల్‌కు వెళ్లిపోవాలి.

భార్య భర్తలు ఇద్దరూ సంపాదిస్తే గానీ ఇల్లు గడవని నగటు సంసారం వాళ్లది.

ఫస్ట్ అయ్యే సరికి రెండు జీతాలు యింటి కొచ్చినా నెలసరి బడ్జెట్‌ను బ్యాలెన్స్ తప్పకుండా నడిపిస్తేనే పట్టాల మీద సక్రమంగా నడిచే బతుకు బండి అది. అలాంటి బండి అకస్మాత్తుగా ఒకకుదుపుతో గోతిలో పడిపోయింది పార్వతమ్మ మంచం పట్టడంతో. ఖర్చులు పెరగటం మాట అలా వుంచి, అందరూ ఎవరి పనుల మీద వాళ్లు బయటికి వెళ్లపోతే ఆవిడ సంగతి ఎలా?' అన్నది పెద్ద సమస్య అయింది. ఏం చేయాలో తోచని అయోమయ స్థితిలో పడిపోయారు సుశీల, ఆమె భర్త.

"నేను ఆఫీసుకెళ్తే మీ అమ్మగారి సంగతి ఎలా నండీ!" అని దీనంగా ప్రశ్నించింది సుశీల.

"ఎవ్వరైనా మనిషి దొరుకుతుందేమో కనుక్కోక పోయావా?" అన్నాడు రామారావు.

"ఈ పట్టణంలో అదీ ఈ రోజుల్లో మంచాన పడ్డ రోగి మల మూత్రాలు ఎత్తిపోసే పనికి ఎవరు ఒప్పుకుంటారండీ. మీరు ఏ కాలంలోకి వెళ్లిపోయి మాట్లాడుతున్నారు? మన పనిమనిషిని చూస్తున్నాంగా. రెండు రోజులు పనికి వస్తే నాలుగు రోజులు మానేస్తుంది. కంచాల్లో ఎంగిలి మెతుకులు వుంటే కడగనంటుంది. తను వచ్చే సరికి వేడి నీళ్లలో సర్ఫ్ వేసి బట్టలు నాన బెట్టి వుంచాలనీ లేకుంటే చెమట వాసన వస్తాయనీ సణుగుతుంది. 'మోరీ' నిండిందే అంటే ఆ గలీజు పని నేను చేయను అంటుంది. పని మనుషులు కూడా ఇలా మోడ్రన్‌గా మారిపోతున్న ఈ రోజుల్లో–"

సుశీల ఇంకా ఏదో అనబోతుండగా తలుపు శబ్దం అయింది.

"ఎవరో చూడు" అన్నాడు రామారావు. సుశీల తలుపు తీసింది.

ఎదురుగా ఓ నడి వయసు స్త్రీ నిల్చొని వుండటం కనిపించిది.

ఆమె నేత చీర కట్టుకుని వుట్టగోచీ పెట్టి పైకి దోపింది.

పొడవాటి పాపిటి తీసి ముద్దుగా నూనె రాసి తల దువ్వి కొప్పు పెట్టింది. పళ్లన్నీ కనిపించేలా ముఖమంతానవ్వు పులుముకొని నవ్వుతూ వుంటే చూడగానే 'మంచి మనిషి' అనే అభిప్రాయం కలుగుతోంది.

'ఎవరు?' అడిగింది సుశీల.

"నా పేరు నారాయణమ్మ. అదిగో మీ ఇంటి ఎదురుగా కనిపిస్తున్నదే ఆ రేకుల ఇల్లే మాది. రోజూ పొద్దున్నే తులసి కోట దగ్గర పూజ చేస్తూ ఓ పెద్ద మనిషి.. మీ అత్తగారనుకుంటా' కనిపించేది. ఈ మధ్య కనిపించడంలేదని అడిగితే ఎవరో అన్నారు మంచాన పడిందని. రోజూ చూస్తుంటాముగా మీరు, మీ పెనిమిటి, పిల్లు అంతా బయటికి పోతుంటారు. ఇంట్లో ఎవ్వరూ లేకుంటే ఆ ముసలమ్మగారి గతి ఏమిటా అని రోజూ ఆలోచించే దాన్ని. నేను పొద్దస్తమానం ఖాళీగా ఇంట్లో పడుంటాను. కొడుకు రిక్షా తొక్కుతాడు. కోడలు పాచిపని చేస్తుంది నాలుగిళ్లలో. చేద్దామంటే నాకేమీ పనుండదు. అయినా అస్తమానం అదో ఇదో సవరిస్తూ వుంటాను ఏమీ తోచక. సాయంత్రం గుళ్లో రోజూ అయ్యగారు పురాణం చెబుతారు. వెళ్లి అక్కడ కూచుంటాను. అదయినాక అందరం కలిసి భజన చేస్తాం. ఏదో కాలక్షేపం కోసం అనుకోండి. మొన్న పురాణం చెబుతూ అయ్యగారు చేతకాని వాళ్లకు సాయం చేస్తే పుణ్యం అనీ, మనం చేసిన పుణ్యమే మనల్ని కాపాడు తుందనీ అన్నారు. పుణ్యం మాట అటుం డనియ్యండి– అది రాక పోయినా పర్వాలేదు. ఖాళీగా గోళ్లు గిల్లు కుంటూ కూచోవటం కన్నా పెద్దమ్మగారి దగ్గర పడుంటే ఆమెకూ, నాకూ కాలక్షేపం అవుతుంది గదా అని ఇలా వచ్చాను" – అంది నారాయణమ్మ నిండుగా నవ్వుతూ.

సుశీల, రామారావులు ఆశ్చర్యంతో ముఖాముఖాలు చూసుకున్నారు.


ఈ రోజుల్లో కూడా ఇలాంటి మనుషులున్నారా అనిపించింది వాళ్లకు.

తమ మనసులోని మాటను, మంచాన పడ్డ ఆ ముసలమ్మ అవసరాన్ని గుర్తించి అడక్కుండానే ఆ భగవంతుడు నారాయణమ్మను ఆ విధంగా పంపించాడా! అనిపించింది.

"నారాయణరమ్మా...! పిలవకుండానే వచ్చి గుమ్మంలో నిల్చొని సాయం చేస్తానంటున్నావు. నిజంగా ఆ దేవుడే నిన్ను పంపించాడనిపిస్తోంది. ఇప్పుడు నీలాంటి మనిషి అవసరం మాకు చాలా వుంది. కానీ మంచాన పడ్డ మనిషి అంటే తెలుసుగా... మలమూత్రాలు కూడా మంచంలోనే ...మరి... అవి– ఎత్తాలంటే – నీకు..." అంటూ నసిగింది సుశీల.

"నాకేమీ అసహ్యంలేదు. మనిషికి మనిషి అవసరం పడేది ఇలాంటప్పుడే గదమ్మా. మంచిగా వున్నప్పుడు ఇలాంటి పనులు ఆయమ్మ చేయించుకోమన్నా చేయించుకుదో? మనం మనిషి జన్మ ఎత్తామని నిరూపించుకోవాల్సింది ఇలాంటి సమయాల్లోనేగా. అదీ గాక ఆ పెద్దమనిషి బతికి నన్ని రోజులూ ఇలా బతకదు కదా. అలా చివరి దశలో వున్న వాళ్లకు సేవ చేస్తే భగవంతుడు తనకు పూజలు చేసిన దానికన్నా ఎక్కువ సంతోషపడతాడు" అంది నారాయణమ్మ.

సుశీల, రామారావు నోరు తెరుచుకుని అలాగే నారాయణమ్మ మాటలు విన్నారు. ఈ మట్టిలో



మాణిక్యం ఎక్కడినుంచి వచ్చింది! స్లమ్ ఏరియాలో నుంచి వచ్చిన నారాయణమ్మలో ఇంతటి సంస్కారం ఎలా సాధ్యం? పూర్వజన్మ సుకృతమా? లేకుంటే మాటల్లో, ఉచ్చారణలో ఆ స్పష్టత ఎలా వస్తుంది. మనసు నిండా అంత అభిమానం, కళ్లనిడా మంచితనం మామూలు మనిషికి, స్వార్థజీవి అయిన మనిషికి ఎలా లభిస్తాయి.

"ఏం చదువుకున్నావు నువ్వు?" సందేహంగ ప్రశ్నించాడు రామారావు.

"అయ్యో! నా చదువే అడుగుతున్నారూ... నానా కాలం చదువు. వీధి బడిలో ఐదో క్లాసు వరకు చదువుకున్నాను. బళ్లో చదువుకన్నా పెద్దయ్యాక నేను గుళ్లో చదువుకున్నదే ఎక్కువ బాబుగారూ - పూజారి గారు ఎన్నెన్ని మంచి విషయాలు చెబుతారని. మనిషై పుట్టినందుకు ఎలా బతకాలో, ఎలా బతక కూడదో అన్నీ చెబుతారు ఆయన. అయినా బాబుగారూ చదువుకోవటానికి బడికెళితే అక్కడ వాళ్లు నేర్పించేది మొదట అక్షరాలు, ఆ తరువాత పుస్తకాల్లో ఏదిరాసుంటే అదేగా. మన చుట్టూ వున్న ప్రపంచాన్ని చదవటానికి మనుషుల మధ్య కలిసి బతికితే చాలు అదే

అర్ధమయిపోతుంది" అంది నారాయణమ్మ.

మామూలు మాటల్లోనే ఎంత గొప్ప జీవిత సత్యం చెప్పింది ఈమె అనుకున్నారు వారు ఆశ్చర్యంగా.

"ఆఫీసు కెళ్లామని తయారయినట్టున్నారు. మీరు వెళ్లండి. పెద్దమ్మగార్ని నేను చూసుకుంటాను. ఆమెకు పెట్టాల్సిన ఆహారం, బట్టలు గదిలో పెట్టి ఇంటికి తాళం వేసుకుని వెళ్లండి. అంది నారాయణమ్మ

"నారాయణమ్మా! మరి నీ జీతం..." నసిగింది సుశీల.

"భలే వారే అమ్మగారూ... డబ్బులు నాకెందుకు. నేనేం చేసుకోను అయినా వుట్టిగా చేయించుకోటం మీకూ ఇష్టం వుండదు గనుక ఆ అమ్మతో పాటూ నాకూ ఇంత అన్నం పెట్టి కట్టుకోవడానికి ఓ రెండు చీరలివ్వండి. ఇక్కడే ఆ అమ్మ సేవ చేసుకుంటూ పడి వుంటాను" అంది నారాయణమ్మ.

కులంలో, స్థితిగతులలో తమకంటే తక్కువైనా, సంస్కారంలో ఎక్కువైన నారాయణమ్మకు చెతు లెత్తి నమస్కారం చేయాలని అనిపించినా ఏదో హోదా, ఎక్కువ తక్కువ తారతమ్యం అడ్డువచ్చి ఆగిపోయారు సుశీల, రామారావులు.

* * * *

ఎత్తయిన అరుగుమీద కూర్చుని బొగ్గుతో గిన గిసా పళ్లుతోముతోంది నారాయణమ్మ. మధ్య మధ్య కాండ్రించి వుమ్మేస్తూ భయంకరమైన శబ్దాలు చేస్తోంది.

"నారాయణమ్మా. ముఖం కడగటం అయిందా. ఇదిగో టీ – అని పెద్ద గ్లాసుడు టీ తెచ్చి అరుగు మీద పెట్టి వెళ్లింది సుశీల. రెండు చేతులతో గ్లాసు పట్టుకుని ఉఫ్ ఉఫ్ మని ఊదు కుంటూ ఉడయాన్నే వేడి వేడి టీ తాగటంలో ఉన్న ఆనందాన్ని అనుభవిస్తున్నది నారాయణమ్మ.

ఆ తరువాత అప్పడప్పడే ఉదయిస్తున్న సూర్యుడికి చేతులు జోడించి నమస్కారం చేసి రెండు చెంపలూ టప టపా వాయించుకుంది.

చీర కుచ్చిళ్లు సవరించుకుని చెంగులు పైకి దోపు కుని ఇక తన దిన చర్యలో మునిగి పోయింది ఆమె.

"లేచారా పెద్దమ్మగారూ... అప్పడే లేచారే ఇవ్వాళ! ముఖం కడుక్కుందురు గాని లేవండి. బెడ్ ప్యాన్ పట్టనా...

బెడ్ ప్యాన్ పట్టి తిరిగి దాన్ని శుభ్రం చేసి సందున పెట్టి చేతులు కడుక్కుని వచ్చింది నారాయణమ్మ. ఆ తరువాత పార్వతమ్మ వీపుమీదికి ఒక చెయ్యి, భుజం మీదికి మరొక చేయి పోనిచ్చి లేపి పైకి జరిపి దిండుకు ఆనించి కూచో పెట్టింది. బ్రెష్ మీద పేస్టు వేసి ముఖం కడిగించింది. నూనే రాసి తలదువ్వి జడ అల్లి ముడి వేసింది. డెట్టాల్ వేసిన వేడి నీళ్లలో వొళ్లంతా తుడిచి పౌడరేసి జరీ అంచు వున్న మాధవరం చీర కట్టింది.

సుశీల పార్వతమ్మ కోసం రెండు ఇడ్లీలు, బోర్నవిటా తీసుకొచ్చి యిస్తే స్పూన్‌తో వాటిని తినిపించింది...మెల్లిగా.

ఆ తరువాత నారాయణమ్మకు కూడా టిఫిన్ పెట్టింది సుశీల. పనులన్నీ ముగించుకొని వచ్చి పార్వతమ్మ పక్కన కూచుంటే ఆమె 'నా...రా...య...ణ...మ' అంటూ నంగి నంగిగా పిల్చి ఏదో సైగ చేసింది.

"ఏమిటీ పుస్తకం చదివి వినిపించాలా. వినిపిస్తా లెండి.. మీకూ నాకూ ఇక పనే ముంది. నేను చదువు తుంటాను మీరు వింటూ పడుకోండి. నిన్న పూజారి గారు కార్తీక పురాణం యిచ్చారు. ఈ మాసంలో అది చదివినా, విన్నా పుణ్యమట" అని పురాణం పుస్తకం తెచ్చి పేజీలు తిప్పింది. చదవటానికి ముందు ఏదో సందేహం వచ్చి ఆగి పోతూ 'అమ్మ గారూ... ఏదో చదువుతాను గాని, అంత బాగా రాదు. అక్కడక్కడ తప్పలు కూడా చదువుతున్ననేమో. నేను చదివేది మీకు అర్థమవుతోందా" అని ప్రశ్నించింది నారాయణమ్మ.

"బాగా చదువుతున్నావు" అన్నట్లు తలవూపుతూ తన ప్రశంసలు తెలియచేసింది పార్వతమ్మ. నారా యణమ్మ వచ్చినప్పటి నుంచి ఆమెకు మంచి కాలక్షేపంగా వుంది. ఇంతకు ముందు మంచానికి

అంటుకు పోయి పొద్దుపోక విసుగొచ్చేది. అలాం టిది అస్తమానం తనని కనిపెట్టుకొని వుంటూ ఏ మాత్రం విసుగూ, విరామం లేకుండా సేవ చేస్తున్న నారాయణమ్మతో సహవాసం పార్వతమ్మకు హాయిగా వుంది.

మనిషికీ మనిషికీ మధ్య వుండే అనుబంధం అది ఏ రక్త సంబంధమో, బంధుత్వమో అయి వుండనవసరం లేదు. రవ్వంత ప్రేమ, పిసరంత సేవాభావం సైతం మనుషుల మధ్య విడదీయ రాని బంధాలు ఏర్పరుస్తాయని రుజువు చేసింది పార్వతమ్మ, నారాయణమ్మల అనుబంధం.

నారాయణమ్మ పెద్దగా చదువుకోక పోయినా ఆమెకు పేషెంట్ సైకాలజీ తెలుసు. తొంభయ్యేళ్ల వృద్ధుణ్ణి నువ్వు ఇంకో పదేళ్లు గ్యారంటీగా బతుకు తావు' అంటే అతని ముఖంలో జీవకళ వస్తుంది. అలాగే నారాయణమ్మ మాటలు పార్వతమ్మ ముఖంలోనూ కొత్తకళను నింపాయి.

"అమ్మగారూ... మీ కెమయినా తినాలని వుంటే చెప్పండి. కోడలిగారికి చెప్పి చేయించి తీసుకొస్తాను" అని పార్వతమ్మ ఏదడిగితే అది నిమిషాల మీద చేయించి తీసుకొస్తుంది నారాయణమ్మ. లేకుంటే దుకాణంలో కొని, కొన్న వస్తువును కొంగున ముడేసుకొని తెచ్చి అప్యాయంగా తినిపిస్తుంది.

అలా నారాయణమ్మ సేవలో మరో రెండు సంవత్సరాలు జీవిత శకటాన్ని సునాయాసంగా లాక్కొచ్చింది పార్వతమ్మ.

---



## టెడ్డీబేర్

అందంగా ఉన్న ఈ టెడ్డీబేర్‌ను చూసి ఇది మామూలు టెడ్డీ బేర్ అనుకొంటున్నారా? కాదు సుమా! దీని పొట్టలో 400 డాలర్ల విలువైన కెమెరా ఏర్పాటు చేయబడివుంది. ఇంటి నుంచి తల్లిదండ్రులు ఉద్యోగాల నిమిత్తం బయటకు వెళ్లినది మొదలు ఆ ఇంట్లో జరిగే ప్రతి విషయాన్ని ఈ టెడ్డీ బేర్ తన ఉదరంలో ఉన్న కెమేరాలో అందంగా భద్రపరుస్తుంది. తల్లిదండ్రులు తమ పనుల ఒత్తిడివల్ల పిల్లల రక్షణను ఆయాలకు అప్పగిస్తారు. ఆయాలు రోజంతా తమ పిల్లల్ని ఎలా చూస్తున్నారో అనే భయంలో తల్లిదండ్రుల్లో ఉండడం సహజం. ఇప్పడీ టెడ్డీబేర్ వల్ల వారికెలాంటి భయం ఉండదు. ఇళ్లకు తిరిగొచ్చాక కెమేరాలోని ఫోటోలను చూడగానే ఆయాల బండారం బయట పడుతుంది!



## చౌకబేరం

అందాల రాణి డయానాకు రాజ ప్రాసాదంలో ఒక నీటైన పని మనిషి ఉండేది. ఆ సొగసుగత్తె పేరు సిల్వీ డెర్మోట్. ఈమెను డయానా హఠాత్తుగా పనిలో నుంచి తొలగించింది. సిల్వీ కోర్టుకు ఎక్కింది. అంతేకాక రాజభవనంలోని నాలుగ్గోడల మధ్య జరుగుతున్న అనేక 'మహా రహస్యాల'ను బయట పెడతానంటూ డయానాను ఆమె బెదిరించింది. దాంతో డయానా గుండెల్లో గుబులు బయల్దేరి తన ప్లీడరు సహాయంతో కోర్టుకు వెళ్లకుండానే సిల్వీతో రాజీ పడిపోయి, ఆమెకు సంవత్సరానికి తొమ్మిది వేల పౌండ్లు సమర్పించుకునేలా ఓ ఒప్పందం కుదుర్చుకుంది! "ఇది చాలా చౌకైన బేరం సుమా!"అన్నాడు డయానా లాయర్!!

ఎన్నేళ్లు బతికినా ఏదో ఒక రోజు జీవితంలో ఆఖరు రోజు కాక తప్పదు. మూడు రోజుల నుంచి పార్వతమ్మకు ఒంట్లో బాగా లేదు. లాభంలేదని' చెప్పాడు డాక్టరు. నారాయణమ్మకు కాళ్లూ చేతులూ ఆడలేదు. ఒక పక్క పార్వతమ్మ సేవలు చేస్తూనే మరో పక్క కళ్లు తుడుచుకుంటూ ముక్కు చీదేస్తూ ఇంట్లోకి బయటికి తిరుగుతోంది. మాటి మాటికీ ముఖంలోకి తొంగి చూస్తూ 'అమ్మగారూ... అమ్మగారూ... నేను నారాయణమ్మను. కళ్ళు తెరిచి చూడండి' అని బిగ్గరగా అంటోంది.

పార్వతమ్మ మైకంలో వుంది – మరో లోకంలో వుంది. అందుకే కళ్లు తెరిచి చూడలేదు.

సైగలు, వంగి మాటలూ ఏవీ లేవు.

దుఃఖం పొంగుకు వచ్చింది నారాయణమ్మకు. వెంటనే గుళ్లో పూజారి దగ్గరకు పరుగెత్తి పరిస్థితి చెప్పింది.

"అయ్యగారూ, చావుపక్కమీద వున్న వాళ్లకు 'గరుడ పురాణం' వినిపిస్తే మంచిదని, పుణ్యలోకాలకు చేరుకుంటారని ఒకసారి ఎవ్వరో గరుడ పురాణం చదువుతూ అన్నారు మీరు. ఒక్కసారి మా అమ్మగారింటికి వచ్చి ఆ పురాణం చదవండి. నాలుగు ముక్కలు చెవిలో పడితే ఆ అమ్మ పుణ్య లోకాలకు పోతుంది" అని అడిగింది. అడగటం ఆలస్యం పురాణం పుస్తకం చంకన పెట్టుకొని వచ్చాడు పూజారి.

నారాయణమ్మ వ్యక్తిత్వం ఆయనకు కొత్తకాదు. ప్రతి విషయాన్ని తరచి తరచి చూసి ప్రశ్నలేయడం, ఏది చదివినా అందులో మునిగిపోయి వినటం, విన్నది బాగా గుర్తు పెట్టుకోవటం – వంటివి నారాయణమ్మలోని విశేషాంశాలు. ఎన్నో సార్లు అవి ఆయన్ను ఆశ్చర్యపరిచాయి. అందుకే అడగటం తడవు అక్కడికి వచ్చారు. ఓ గంటలో పురాణ పఠనం పూర్తి చేశారు.

పార్వతమ్మ ప్రాణాలు కొన ఊపిరితో కొట్టు కుంటున్నాయి. శ్వాస అందడం లేదు. మంచం చుట్టూ కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు...

పరిస్థితి గమనించిన నారాయణమ్మ ఒక్క పరుగున సందుకు వెళ్లి గ్లాసులో నీళ్లు తీసుకుని అందులో తులసీ దళం వేసుకొని వచ్చింది.

సుశీల చేతి కిచ్చి "అమ్మగారూ, అయ్యగారి చేత్తో ఈ తీర్థం పోయించండి " అంది గద్గదమైన కంఠంతో.

అంత వరకు తమకెవరికీ ఆ ఆలోచన రానందుకు సిగ్గు పడ్డారు అందరూ.

'నువ్వే పొయ్యి' అన్నట్లు సైగ చేసి గ్లాసు తను తీసుకొని తల్లి పక్కన కూర్చున్నాడు రామారావు. నారాయణమ్మ ఉద్ధరిణ తీసుకుంది. అమ్మకు నారాయణమ్మ చేతి తీర్థం తాగితే తృప్తి అని అతనికి తెలుసు. ఆ ఆర్ద్రత ఆమె కొక్క దానికే వున్నదన్న విషయాన్ని కూడా గ్రహించాడు ఆయన.

"అమ్మగారూ... నేను నారాయణమ్మను. ఒక్కసారి కళ్లు తెరిచి చూడండి. ఇదిగో ఈ తీర్థం తాగండి" అని ఒక పక్క ఏడుస్తూనే మరో పక్క పదే పదే గట్టిగా పిలిచింది నారాయణమ్మ.

పార్వతమ్మకు మాట, చూపు పోయి మూడు రోజులైంది. అయినా అక్కడ చూస్తున్న వాళ్లందరినీ ఆశ్చర్యంలో ముంచేస్తూ విచిత్రంగా కళ్లు విప్పి చూసింది పార్వతమ్మ. ఆమె దృష్టి నారాయణమ్మ ముఖంమీదే కేంద్రీకృతమై వుంది. మాట పూర్తిగా పడి పోయిందనుకున్న ఆమె 'నా...లా...య...న' 'నా... లా...య...న' అంటూ తల పక్కకు వాల్చేసింది. తులసి తీర్థపు చుక్కలు గొంతులో మింగుడు పడ్డాయి. అదే ఆఖరి గుటక. పార్వతమ్మ ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

* * * *

కర్మకాండల కార్యక్రమం యధావిధిగా నడుస్తున్నది. ఇంటి నిండా బంధువులు, మిత్రులు. సందడిగా హడావుడిగా వుంది.

అంతమంది మధ్య వున్నా ఒంటరితనంతో బాధపడుతోంది నారాయణమ్మ.

మాటిమాటికీ పార్వతమ్మ పడుకున్న గదిలోకి వెళ్లి మంచం చూసుకుని వస్తోంది. అక్కడికి వెళితే ఆమెను చూసినట్లే అనిపిస్తోంది.

తద్దినం రోజు గారె ముక్క నోట్లో పెట్టుకుంటూ బావురుమని ఏడ్చింది.

పదమూడో రోజు తన గుడ్డసంచి చంకన పెట్టుకొని 'వెళ్లొస్తాను చిన్నమ్మగారూ...' అంటూ సుశీల దగ్గరికి వచ్చింది. సుశీల ఆశ్చర్యపోయింది. చాలా బాధ పడింది.

"నారాయణమ్మా... నువ్వు అత్తగారి సేవకోసమే ఇక్కడికి వచ్చినా ఇంటి మనిషిగా అందరికీ అలవాటయ్యావు. నువ్వు వెళ్లిపోతే మేమంతా చాలా బాధపడతాం. నువ్వు ఇక్కడే వుండిపో. నువ్వు ఏ పనీ చేయనక్కర లేదు. ఇల్లు కనిపెట్టుకుని వుండు చాలు. నీకు ఏ లోటూ రానియ్యం" అంది నారాయణమ్మలాంటి మంచి మనిషిని పోగొట్టుకోవటం ఇష్టం లేక.

కానీ, నారాయణమ్మ తల అడ్డంగా తిప్పింది.

"అమ్మా! ఆ ఎదురింటి బంగళాలో ఓ ముసలమ్మ ఏదో బొమికల వ్యాధితో మంచాన పడివుందట. ఎప్పుడో రమ్మని కబురు చేసినా ఈ పెద్దమ్మగార్ని వదిలిపెట్టి పోలేక పోయాను. మీ మానాటను కాదంటున్నందుకు క్షమించండి. మీకు మీ ఇల్లును కనిపెట్టుకుని వుండటానికి మరో మనిషి ఎవరైనా దొరుకుతుంది. ఇక్కడికన్నా నా అవసరం అక్కడ ఎక్కువ వుందనిపిస్తోంది గనుకనే వెళ్లిపోతున్నాను, ఏమనుకోకండి" అని వెళ్లిపోయింది – ఊరందరి మనిషైన నారాయణమ్మ.

స్వార్థంతో ఆమెను తనయింట్లోనే వుంచుకోవాలన్న ఆలోచన వచ్చినందుకు తనను తనే నిందించుకుంది సుశీల. వెళుతున్న నారాయణమ్మ వంకే చూస్తుండిపోయింది సుశీల.